పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ధర్పల్లి, జూన్ 13 : మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద జిల్లా పౌర సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం కళాజాత నిర్వహించారు. పాటలు, నృత్యాల ద్వారా పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలని కోరారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు క్రాంతికుమార్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

వినాయక్‌నగర్, జూన్13: తెలంగాణ రాష్ట్ర న్యాయవాద ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నిజామాబాద్‌బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్‌ను ఆర్మూర్ బార్ అసోసియేషన్ మాజీ సంయుక్త కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజ్ కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంతరావు పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

కోటగిరి, జూన్ 13: సర్కారు బడుల్లో మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల ప్రత్యేకశాఖ ఏఈ నివర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కోటా కింద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు.

హరితవనాలు ఏర్పాటు చేయాలి

ధర్పల్లి, జూన్ 13 : గ్రామాల్లో హరితవనాల కోసం మొక్కలు నాటేందుకు తగిన స్థలాలను ఎంపిక చేసి, లక్ష్యం మేర గుంతలు తీసి మొక్కలు నాటాలని ఎంపీడీవో బాలకృష్ణ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పాంపాండ్స్, పండ్ల తోటల పెంపకం, మిషన్ భగీరథ సర్వే పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో వినోద, ఈసీలు, టీఏలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు విడుదల

ఖలీల్‌వాడి, జూన్ 13: మధ్యాహ్న భోజన 2023-24 పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేసినట్లు డీఈవో దుర్గా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఏజెన్సీల ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు.

వాహనం పైనుంచి కిందపడి యువకుడు మృతి

వినాయక్ నగర్, జూన్ 13: ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్సై తెలిపారు. నిజామాబాద్ నుంచి జన్నేపల్లి వైపు గుర్తుతెలియని యువకుడు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై బుధవారం రాత్రి వెళ్తుండగా.. ఆకుల కొండూరు శివారులో రైస్‌మిల్ ఎదురుగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 25 ఏండ్లు ఉంటుందని, అతడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలూ లభించలేదని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉంచారని, సంబంధీకులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీసులను లేదా 87126-59849 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా..

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

సారంగాపూర్, జూన్ 13 : రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం నగర శివారులోని 3వ డివిజన్ పరిధి గూపన్‌పల్లిలో జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ.11 లక్షలతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గంగ స్థాన్ ఫేస్-2 ప్రాంతంలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కాలనీ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిటికెల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

గుండారంలో..

సారంగాపూర్, జూన్ 13 : మండలంలోని గుండారం జడ్పీ హైస్కూల్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ రవీందర్, డీపీఎం సాయిలు గురువారం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు దుస్తులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధురిమ, ఎంపీటీసీ అంకల గంగాధర్, ఐకేపీ ఏపీఎం మహేశ్‌కుమార్, సీసీ సంతోష్, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.

వివిధ గ్రామాల్లో..

డిచ్‌పల్లి/మోస్రా (చందూర్)/ రుద్రూర్/ ఖలీల్‌వాడి , జూన్ 13 : డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను ఎంపీపీ నర్సయ్య గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయిలు, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీటీసీ సౌమ్య సుధీర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నవీన్, హెచ్ఎం సంధ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు. మోస్రాలోని ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ గుత్ప విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు .. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవో శాంతాకుమారి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. రుద్రూర్ మండలం బొప్పాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్ పాఠ్యపుస్తకాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని బర్కత్‌పుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృపాల్ సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు.

మెంట్రాజ్‌పల్లిలో దుస్తులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నేడు ధర్పల్లిలో వైద్యశిబిరం

ధర్పల్లి, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు శుక్రవారం చెవి, ముక్కు, గొంతు వైద్య పరీక్షలకు సంబంధించి ప్రత్యేక వైద్యులు విచ్చేస్తున్నారని మండల మెడికల్ ఆఫీసర్ సుశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెవి, ముక్కు, గొంతుతో పాటు ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వైద్యులు సైతం వస్తున్నారని, ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి వైద్యులు అందుబాటులో ఉంటారని, మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

21న జడ్పీ సర్వసభ్య సమావేశం

ఖలీల్‌వాడి, జూన్ 13: జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు ధర్మపురి అర్వింద్, సురేశ్‌షెట్కార్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

ఖలీల్‌వాడి, జూన్ 13: జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి బుధవారం విద్యుత్ ప్రగతి భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజావాణి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలవరకు నిర్వహిస్తారని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోటగిరి, జూన్ 13: వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జీ ఎంపీడీవో మారుతి సూచించారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మిషన్ భగీరథ నల్లాల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గుంతలు ఉంటే వెంటనే పూడ్చి వేయాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చేందకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. నెలకు రెండు, మూడు సార్లు వాటర్ ట్యాంకులు శుభ్రంగా కడిగించి, బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. రోడ్లపైన చెత్త వేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

రుద్రూర్, జూన్13: గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ గోసంరక్షక్ సభ్యులు గురువారం ఎస్సై అప్పారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ వస్తు న్న నేపథ్యంలో గోవుల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని గట్టి బందోబస్తు ఏర్పాటుచేయాలని కోరారు. గోసంరక్షక్ మహేందర్, ఉదయ్, శ్రీధర్, శ్రీవర్ధన్, లోకేష్, రాజ్‌కీర్తన్, నితిన్ తదితరులు ఉన్నారు.

ఎస్సైకి వినతి పత్రాన్ని అందజేస్తున్న గోసంరక్షక్ సభ్యులు

21 వరకు ఉచిత యోగా తరగతులు

సుభాష్‌నగర్, జూన్ 13: నిత్యం యోగా, ధ్యానం చేయడంవల్ల సంపూర్ణ ఆరోగ్యం, మనశ్శాంతి కలుగుతుందని ప్రముఖ యోగాచార్యులు వేదమిత్ర అన్నా రు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజం మహర్షి దయానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848853383 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ యూనివర్సిటీ సమాచారం

- **సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి:** డిచ్‌పల్లి, జూన్ 13 : సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని టీయూ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అన్నారు. వేసవి సెలవుల అనంతరం టీయూలో గురువారం నిర్వహించిన విభాగాధిపతుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్నల్ మార్క్స్, ప్రాక్టికల్స్, థియరీ ఎగ్జామ్ పకడ్బందీగా చేపట్టాలన్నారు.తరగతి గదిలో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తూ, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక జ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు.
- **కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు :** డిచ్‌పల్లి, జూన్ 13 : టీయూ పరిధిలో గురువారం ఉదయం డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, మధ్యాహ్నం 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పరీక్షలకు 4,544 మంది విద్యార్థులకు 3,972 మంది హాజరు కాగా 372 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 162 అభ్యర్థులకు 150 మంది హాజరుకాగా.. 12 మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు.
- **టీయూ విద్యార్థిని రాధిక మోరేకు డాక్టరేట్:** డిచ్‌పల్లి, జూన్ 13: టీయూ రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థిని డాక్టరేట్ సాధించారు. డాక్టర్ జి.బాలకృష్ణన్ పర్యవేక్షణలో 'డిజైన్, సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ పైరిడిన్, పైపరజిన్, ఫినైల్ ప్రొపైయోనిక్ ట్రయజోల్ ఎనలాగ్స్ ఆస్ యాంటీ క్యాన్సర్ అండ్ యాంటీ మైక్రోబైల్ ఏజెంట్' అనే అంశంపై పరిశోధన చేయగా.. ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు.
- **డిగ్రీ ఫలితాలు సకాలంలో విడుదల చేయాలి :** డిచ్‌పల్లి, జూన్ 13 : డిగ్రీ పరీక్షల ఫలితాలను సకాలంలో విడుదల చేయాలని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి అన్నారు. టీయూ పరీక్షల విభాగంలో కంట్రోలర్ ఆచార్య అరుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అడిషనల్ కంట్రోలర్స్ వివిధ కళాశాలల అధ్యాపకులతో అనుసంధానమై ఫలితాలను అనుకున్న సమయానికి విడుదల చేయాలన్నారు.
- **హాస్టల్స్‌లో పరిశుభ్రత పాటించాలి:** డిచ్‌పల్లి, జూన్ 13: వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అన్నారు. టీయులో చీఫ్ వార్డెన్ మహేందర్ అధ్యక్షతన హాస్టల్ వార్డెన్స్ కేర్‌టేకర్స్‌తో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు వర్సిటీకి హాజరవుతున్నారని, వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హాస్టల్ గదులను శుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన నీటిని అందించాలని, భోజనం రుచిగా ఉండాలని అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కంఠేశ్వర్, జూన్ 13: కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గురువారం కలిశారు. సమీకృత జిల్లా కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో భేటి అయ్యారు. నియోజకవర్గానికి చెందిన అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలుపై చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యేతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు వచ్చినప్పటికీ ఎవ్వరూ కలెక్టర్ చాంబర్‌లోనికి ప్రవేశించలేదు.

పోస్టర్ల ఆవిష్కరణ

సిరికొండ, జూన్ 13: భద్రాద్రి జిల్లా ఇల్లెందులో ఈ నెల 23న నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు తాళ్ల రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో బీడీ కార్మికులు, ప్యాకర్ల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగాధర్, గొరేమియా, మారుతి, బీరయ్య, సురేశ్, బొర్రన్న, బీడీ ప్యాకర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

మోస్రా (చందూర్), జూన్ 13: మోస్రా మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు గురువారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో యాత్రికుల బస్సుపై ఉగ్రదాడిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాల్పులు జరిపిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని కోరారు.

పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలి

వల్లభాపూర్‌లో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

బోధన్/మాక్లూర్/ మోర్తాడ్/ బోధన్ రూరల్/ భీమ్‌గల్/ ఆలూర్, జూన్ 13: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మాక్లూర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ గొట్టుముక్కుల, గుంజలి, కొత్తపల్లి, వల్లభాపూర్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్‌ను ఆయన గురువారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైక్రాంతి, పీఆర్ ఏఈ శ్రీనివాస్, మండల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం ఎంఏ వాహెద్ యూనిఫామ్స్ అందజేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్‌ను తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజాశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి గంగామణి, ఉపాధ్యాయిణులు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో పాఠ్య పుస్తకాలను డీసీసీబీ డైరెక్టర్ గిర్దవర్ గంగారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశంతో కలిసి పంపిణీ చేశారు. భీమ్‌గల్ మండలంలోని ఎంపీపీఎస్ దేవన్‌పల్లి, ఎంపీయూపీఎస్ బాబాపూర్ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్‌బుక్స్ అందజేసినట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఆలూర్ మండలంలోని కల్లెడి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైస్ ఎంపీపీ సుజాతా సుధాకర్ పాఠ్యపుస్తకాలు అందించారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, జూన్13: పట్టణంలోని జంబి హనుమాన్ విద్యుత్ కార్యాలయంలో గురువారం సిబ్బందికి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఈ అశితారెడ్డి వివరించారు. వర్షాకాలం సందర్భంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల స్వాగతం

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పూర్తికాని మరమ్మతు పనులు
- పలుచోట్ల శిథిలావస్థలో తరగతి గదులు

బోధన్, జూన్ 13: బోధన్ నియోజకవర్గంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రారంభించిన మరమ్మతు పనులు పూర్తి కాలేదు. అనేక పాఠశాలల్లో విద్యార్థులు కూర్చొలేని దుస్థితి ఉంది. నియోజకవర్గంలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన పాఠశాలల్లోని పనులు కనీసం 30 శాతం కూడా పూర్తికాలేదు. బోధన్ పట్టణం, బోధన్ ఉమ్మడి మండలంలో కలిపి 65 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికచేశారు. వీటిలో ఎడెనిమిది పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటు పూర్తికాలేదు. గత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం ఇంటర్వెల్‌లో విద్యార్థులకు రాగిజావ ఇచ్చేవారు. మధ్యాహ్నం భోజనంలో గుడ్డు ఇవ్వని మంగళ, గురు, శనివారాల్లో ఈ రాగిజావ అందించేవారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ రాగిజావ పంపిణీపై స్పష్టత లేదు. బోధన్ పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ మీడియం)లో గతేడాది ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. ప్రస్తుతం బ్రేక్‌ఫాస్ట్‌పై విద్యా శాఖ అధికారులకు సమాచారం అందలేదు.

ఇది బోధన్ పట్టణంలోని భీమునిగుట్ట ప్రాథమిక పాఠశాల.. ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పక్కపక్కనే రెండు గదుల్లో ఈ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఫ్లోరింగ్ చెడిపోయింది. చిన్నపాటి వర్షానికే భవనం స్లాబుపై నుంచి నీరు ఊరుస్తుంది. కిటికీలకు తలుపులు లేవు. ఈ పాఠశాలను అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేశారు. ఫ్లోరింగ్, తాగునీరు. పైకప్పు మరమ్మతు తదితర పనులకు రూ.8.50 లక్షలు కేటాయించారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తికాలేదు.. అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు

తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు నోచుకోని మూత్రశాల

మోర్తాడ్, జూన్13: బాల్కొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో సమస్యల మధ్య సర్కారు బడులు ప్రారంభమయ్యాయి. అమ్మ ఆదర్శపాఠశాల పనులు ఎక్కడా పూర్తికాలేదు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో మూడునాలుగు రోజుల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేక వినియోగించలేని పరిస్థితి ఉంది. పైలైట్ ప్రాజెక్ట్ కింద బాల్కొండ నియోజకవర్గంలో 12 పాఠశాలలను ఎంపిక చేసి గత అక్టోబర్ నుంచి అల్పాహారం అందించారు. బిల్లులు రాకపోవడంతో అల్పాహారాన్ని ప్రస్తుతం నిలిపివేశారు.



మోర్తాడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో

వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

మోర్తాడ్/బాల్కొండ/రెంజల్/చందూర్/కోటగిరి, జూన్ 13: గ్రామాల్లో మిషన్‌భగీరథ కుళాయిల సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని డీపీవో తరుణ్ అధికారులను ఆదేశించారు. గురువారం మోర్తాడ్ మండలం మోర్తాడ్, గాండ్లపేట్, కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రాజాశ్రీనివాస్, ఎంపీవో శ్రీధర్, కార్యదర్శులు రామకృష్ణ, శాంతికుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండలో సర్వేను డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ పరిశీలించారు. రెంజల్‌లో నిర్వహిస్తున్న సర్వేను బోధన్ డీఎల్పీవో సాయిబాబా పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గౌసొద్దీన్, కార్యదర్శి ఉన్నారు. చందూర్‌లో ప్రత్యేకాధికారి, ఎంపీవో తారాచంద్ పంచాయతీ అధికారులతో కలిసి ఇంటింటా మిషన్ భగీరథ నల్లాల సర్వే చేశారు. కోటగిరిలోనూ ఇంటింటి సర్వే కొనసాగింది.

సంక్షిప్తంగా..

- **ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు**– ఆర్మూర్‌టౌన్, జూన్13: పట్టణంలోని పెర్కిట్, మామిడిపల్లి ఏరియాల్లో పలు దుకాణాలు, హోటళ్లలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి గురువారం తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాదారులు వచ్చేవారికి జ్యూట్ బ్యాగుల్లో సరుకులు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది వెంకటేశ్, అజయ్, అక్షయ్, రవి, ప్రశాంత్, నరేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.
- **క్షయ వ్యాధిపై అవగాహన** - బోధన్ రూరల్,జూన్13: మండలంలోని ఊట్పల్లి గ్రామంలో గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటా క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ ఏసాన్, పద్మా, డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎం సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.
- **ఆలయ ఆవరణలో డ్రైనేజీ నిర్మించాలి**- ఆర్మూర్‌టౌన్, జూన్13: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ సమీపంలో మేరు సంఘం శివాలయం ఆవరణలో డ్రైనేజీని నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రాజుకు మేరు సంఘం సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలోనూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి పనులు ప్రారంభించాలని కోరారు.
- **విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు**- మోర్తాడ్, జూన్13: మండల కేంద్రం శివారులో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు చెట్టు విరిగి విద్యుత్ తీగలపైపడింది. దీంతో కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు తీగలపై పడ్డ చెట్టును తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.
- **జాతీయ బాల పురస్కారానికి 'చిన్నారి కథల పుస్తకం' ఎంపిక** - ఏర్గట్ల, జూన్ 13: మండలంలోని తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని డేగల వైష్ణవి జాతీయ బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ తెలిపారు. జాతీయ శ్రీవాణి సాహిత్య పరిషత్ పెందోట బాల సాహిత్య పురస్కారానికి